# సైనస్ ఇంటూ సైనస్

## వసుంధర

రమణరావుకు భార్య శాంతి అంటే చెప్పలేనంత ఇష్టం. వాళ్ళ పెళ్ళయి అయిదేళ్ళయింది. ఇంకా పిల్లలు లేరు. అందుకేనేమో రమణరావు భార్యను పసిపిల్లలా చూసుకుంటాడు.

భార్యా రూపవతీ శత్రుః అంటారు. అందుకే అందమైన భార్యలున్న భర్తలు వేయికళ్ళతో భార్యలను గమనిస్తుంటారు. వారిపై నిఘా వేస్తుంటారు. వారిని ఒంటరిగా వదిలి వెళ్ళడానికి భయపడతారు.

రమణరావు భార్య రూపవతి. అతను కూడా ఆమెనొంటరిగా వదిలి వెళ్ళడానికి భయపడతాడు. కానీ అందుక్కారణం అనుమానం మాత్రం కాదు ప్రేమ నిజంగా ప్రేమే!

ప్రేమకు తగ్గట్టే రమణరావు హోమియోపతి ప్రాక్టీసు చేస్తున్నాడు. నగరంలో అతడికి మంచి పేరుంది. నెలకు ఐదారువేలు తక్కువ కాకుండా సంపాదిస్తున్నాడు. ప్రాక్టీసింట్లోనే కావడంవల్ల భార్యను విడిచి క్షణం కూడా దూరంగా ఉండాల్సిన అవసరం లేదు.

అయితే గత రెండు సంవత్సరాలుగా అతడికో కొత్త ఇబ్బంది వచ్చింది. అక్కడికి తెరవై కిలోమీటర్ల దూరంలో ఓ కుగ్రామంలో రమణరావు దూరపు బంధువొకాయన ఉంటున్నాడు. వరుసకాయన కతడికి తాత అవుతాడు. పల్లెటూళ్ళో పాతికెకరాల భూమికి వారసుడు. ఆయన నోరు బొత్తిగా మంచిదికాక అయిన వాళ్ళందరూ వదిలిపెట్టేశారు. ప్రస్తుతానికో పక్షవాతవాడాయన ఆలనాపాలనా చూసుకుంటున్నాడు.

అదృష్టమో, దురదృష్టమో ఆయనకేదో జబ్బు చేసి ఏ మందులకూ లొంగలేదు. రమణరావు వైద్యమాయనకు పనిచేసింది. ఆయన తన గ్రామం వదిలిరాడు. రెండేసి నెలలకోసారి అతడాయన్ను చూసి వస్తుండాలి. దాని కతడికేమీ అభ్యంతరం లేదు. ఎటొచ్చీ ఒకసారి వెడితే అక్కడ రెండు మూడు వారాలుండి పోవలసి వస్తోంది. అందుకు రెండు కారణాలు. తాతకు రమణరావు బాగా నచ్చాడు. అతడి మందులకు మించి అతడితో సంభాషణ ఆయనకు తృప్తి నిస్తుంది. తనెంత మంచివాడో తన వాళ్ళందరూ తనకెలా అన్యాయం చేశారో రమణరావుకు చెప్పుకుని ఉపశాంతి పొందుతూంటాడాయన. ఇదో కారణమైతే రెండోది ఊళ్ళోవాళ్ళు. అతడి హస్తవాసి మంచిదని ఊరంతా ఎంతైనా డబ్బిచ్చి అతడి వైద్యానికెదురు చూస్తారు. తన ప్రాక్టీసునక్కడే కొంతకాలం కొనసాగించక తప్పదతడికి.

తాత తన తదనంతరం ఆస్తిని రమణరావు పేర రాస్తానంటున్నాడు. ఊళ్ళో ఆదాయం బాగా వస్తోంది. అందువల్ల శాంతి కూడా రమణరావును పల్లెటూరు వెళ్ళడానికి ప్రోత్సహిస్తుంటుంది.

కానీ —

ఒకసారి ఆమె తన మనసు బాగోలేదని త్వరగా వెనక్కు వచ్చేయమని ముందే చెప్పింది. అప్పుడు పల్లెటూళ్ళో రమణరావొక రోగిని రెండు మూడురోజులపాటు పరీక్షించాల్సి వచ్చింది. తాత కూడా అంత సులభంగా వదిలేలా లేడు. భార్య తనను తప్పుగా అర్థం చేసుకోకూడదని అతడు తన ప్రేమనంతా రంగరించి సిరాలోకలిపి ఆమెకో ఉత్తరం రాసి — ఆ ఉత్తరం చదివి భార్య తనను క్షమిస్తుందన్న నమ్మకంతో పదిరోజుల తర్వాత ఇంటికి తిరిగివెళ్ళాడు.

శాంతి అతడిపై అలిగింది. ఇంట్లో శాంతివున్నా శాంతి లేకుండా పోయింది. రమణరావుకేం చేయాలో తోచలేదు.

అసలు సంగతేమిటంటే అతడు రాసిన ఉత్తరమామె కందలేదు.

60 కిలోమీటర్ల దూరంలో ఉత్తరాన్ని ఆరు రోజులకు కూడా అందించని పోస్టలు డిపార్టుమెంట్‌ని రమణరావు మనసులో తిట్టని తిట్టులేదు. శాంతి మామూలు మనిషి కావడానికి రెండు వారాలు పట్టిందది. మళ్ళీ అలాంటి తప్పు చేయనని రమణరావు భార్యకు వాగ్దానం చేశాడు.

వాగ్దానం చేసి ఏడాదయింది.

రమణరావు పల్లెటూరికి వెళ్ళడం తప్పడంలేదు. కూడా భార్యను తీసుకుని వెడదామా అంటే తాతగారినామె భరించలేదు. నగరంలో రొటీన్‌గా మందులివ్వడానికింట్లో ఓ మనిషుండడం అవసరం. భర్త లేనప్పుడు సర్దుకుపోగలపాటి వైద్యపరిజ్ఞానం శాంతికి భర్తతో ఆర్నెల్ల సావాసానికి ముందే ఉంది.

ఇప్పుడు రమణరావు పల్లెటూళ్ళో ఉన్నాడు. వచ్చి పదిహేను రోజులయింది. ఇంకా రెండ్రోజులైనా అక్కడుండాలి. ఆ సమయంలో అతడికో టెలిగ్రాం వచ్చింది.

"పీడకలొచ్చింది. మిమ్మల్ని చూడాలనుంది. వెంటనే బయల్దేరండి" అని ఉందా టెలిగ్రాంలో.

పిల్లలు పుట్టాకెలా గుంటుందో కానీ ప్రస్తుతానికి శాంతి పసిపిల్లలాగే ప్రవర్తిస్తుంది. మరామె తన ప్రేమను పరీక్షించాలను కుంటుందో ఏమో!

ఆ టెలిగ్రాంను గౌరవించి వెంటనే బయలు దేరాలనుకున్నాడు రమణరావు. అందుకని మరోసారి టెలిగ్రాం చూశాడు.

అప్పుడతడులిక్కి పడ్డాడు.

శాంతి ఆ టెలిగ్రామిచ్చి ఎనిమిది రోజులైంది.

ఉత్తరమైతే ఆలస్యంగా అందుతుందని శాంతి టెలిగ్రాం ఇచ్చి ఉంటుంది. ఆ టెలిగ్రాం ఇంత ఆలస్యంగా అందిందంటే ఆమె నమ్మదు.

టెలిగ్రాం అందుకుని భర్త చలించలేదని ఆమె అనుకుంటుంది. వాగ్దాన భంగం చేశాడంటుంది.

ఏడాదిక్రితం ఇంట్లో చెలరేగిన తుఫాను రమణరావు మరిచిపోలేదు. అలాంటి తుఫాను మరోసారి చెలరేగితే అతడు భరించలేడు.

ఇప్పుడేం చేయాలి!

రమణరావు తాతవద్ద గ్రామస్థులవద్ద సెలవు తీసుకుని వెంటనే నగరానికి బయల్దేరాడు.

టెలిగ్రాంలో ఏముందో తాతకతడు చెప్పలేదు. అందుకని ఆయన "ఇంటికెళ్ళగానే అమ్మాయెలా గుందో ఉత్తరం రాయి" అన్నాడు.

> భార్యను తీసుకుని వెడదామా అంతే— తాతగారి నామె భరించలేదు. నగరంలో రోటీన్‌గా మందులివ్వడానికింట్లో ఓ మనిషుంచడం అవసరం. భర్త లేనప్పుడు సర్దుకు పోగలపాటి వైద్యపరిజ్ఞానం శాంతికి ముందే ఉంది..

"ఉత్తరం ఈ పోస్టలు డిపార్టుమెంట్ సంగతి నీకు తెలియదు తాతా!" అని మనసులో అనుకున్నాడతడు.

ప్రయాణం పొడుగునా మనసులో వేయి దేవుళ్ళకి దణ్ణం పెట్టుకున్నాడతడు.

బస్సొకటి అతడ్ని పల్లెటూర్నించి నగరానికి చేర్చింది.

అరవై కిలోమీటర్ల దూరానికి నాలుగు గంటల ప్రయాణం. రెండ్రోజులు ప్రయాణం చేసినవాడిలా అతడి ఒళ్ళు హూనమైపోయింది.

రిక్షాలో ఇల్లు చేరాడతడు.

తలుపు దగ్గరగా వేసి ఉంది. గడియవేసి లేదని తెలుస్తూనే ఉంది.

రమణరావు తలుపుతోశాడు.

ఎదురుగా—

సోఫాలో కూర్చుని ఉంది శాంతి.

పచ్చటి ఛాయతో మిలమిల మెరిసిపోతోంది.

తలుపుతీసిన అలికిడికామె ఉలిక్కిపడి లేచి నిలబడి భర్తను చూసింది.

రమణరావు కామెనొక్కసారి దగ్గరగా తీసికోవాలని అనిపించింది. కానీ పెనుతుఫానులో సుడిగాలిలా ఆమె తనను విసిరేస్తుందని అతడి భయం.



"వచ్చేరా?" అందామె.

రమణరావు మాట్లాడలేదు.

"తలుపు దగ్గరగా వేయండి!" అందామె.

యుద్ధానికి సన్నద్ధమవుతూనే అతను తలుపు దగ్గరగా వేసి గడియకూడా వేసి — "శాంతీ! నేను రాలేకపోయాను. మన్నించానంటే అసలేం జరిగిందో వివరంగా చెబుతాను" అని ఇంకా ఏదో అనబోతుండగా

శాంతి చటుక్కున దగ్గరై అతడ్ని కౌగలించుకుని పెదాలపై సుతారంగా ముద్దు పెట్టుకుంది.

ఊహించని ఈ పరిణామానికతడు తెల్లబోయి "శాంతీ! నీవెంత మంచిదానివి!" అన్నాడు.

"నేను మంచిదాన్ని కావచ్చు. కానీ గొప్పదాన్ని కాదు. మీలో మంచితనంతోపాటు గొప్పతనం కూడా ఉంది..." అంది శాంతి.

"నాలో గొప్పతనమా?" అన్నాడు రమణరావు. ఆమె నిజంగా అంటోందో వెటకార మాడుతోందో అతడికి తెలియడంలేదు.

"అవునండీ! మీరెంత పొగిడినా నేను సామాన్యురాలినని నాకు తెలుసు. కానీ నేనిలా టెలిగ్రామివ్వగానే అలా ఉత్తరం రాశారు. ఎంత బాగా రాశారండీ! ప్రతిరోజూ ఒకసారి చదువుకుంటూ మురిసిపోతున్నాను. ఇప్పుడు మీరొచ్చే ముందు కూడా నేనుచేస్తున్న పని అదే!" అంటూ శాంతి జాకెట్లోంచి ఓ ఉత్తరం బయటకు తీసింది.

"నేనుత్తరం రాయడమా?" అంటూ తెల్లబోయిన రమణరావు ఉత్తరం అందుకుని చూశాడు.

అప్పుడు రమణరావు పోస్టలు డిపార్టుమెంటు వారిని అభినందించాలో, నిందించాలో తెలియక తికమకపడ్డాడు.

అదతడు ఏడాది క్రితం భార్యకు రాసిన ఉత్తరం!

*

